తెలుగు కథానిక స్వర్ణోత్సవ–
రాజాలక్ష్మి ఫౌండేషన్ గారి కథల పోటీ
బహుమతి పొందిన కథ

# తప్పిపోయిన గది

## వగ్గుమాటి పద్మాకర్

**ఆ**కాశం ఇంకాసేపట్లో చీకటిచీరచుట్టుకోబోతోంది.

మెయిన్ రోడ్డు మీద డాక్టర్ సంజీవరావుగారి కారు జోరుగా పరుగెడుతోంది. అందులో ఆయన భార్యా, నాలుగేళ్ల కూతురూ, ఎనిమిదేళ్ళ కొడుకు కూడా వున్నారు.

నేరుగా ఇంటి వేపు వెళుతున్న కారు కొంచెం స్లో అయి ఎడమ వేపుకుతిరగడంతో భార్య అడిగింది.

"ఇటెక్కడికి?"

"చిన్న సర్‌ప్రయిజ్ చేద్దామనుకుంటున్నాను."

మరి కాస్సేపట్లో కారు ఓ ఇంటి ముందాగింది. కారు దిగి నేమ్ ప్లేటు చూసిన భార్య అడిగింది.

"ఇదేనా మన ఇంజనీరు గారిల్లు!"

"అవును" అంటూ బెల్ నొక్కాడు డాక్టరు.

కుటుంబ సమేతంగా టి.వి. చూస్తున్న సుధాకర్ డాక్టరు గారి కుటుంబాన్ని చూసి, ఆశ్చర్యంగా అన్నారు.

"వాట్ ఎ సర్‌ప్రైజ్!"

పలకరింపులు అయ్యాక, "ఏం లేదు! మన ఇంటి ప్లాన్‌లో ఒక చిన్న మార్పు"

"ఇప్పుడా"

"ఎస్! నా గది పక్కనే ఇంకో గది రావాలి!"

"ఓ.కే.! ప్లాన్ పేపర్స్ తీసుకుని ఉదయం ఇంటికొస్తాను. తీరికగా మాట్లాడుకుందాం. ప్రస్తుతం నా ఆతిథ్యం స్వీకరించండి" నవ్వుతూ ఇంగ్లీషులో అన్న మాటలు విని సుధాకర్ కోరికకు అంగీకరించాడు డాక్టర్.

అరగంట తర్వాత వెళ్ళిపోతున్న డాక్టరుగారి కారు చూస్తూ "డాక్టరు గారికి సెంటిమెంట్స్ కూడా లేవు– ఏం జరిగిందబ్బా" అనుకున్నాడు సుధాకర్.

జరిగిందేమంటే...

* * *

డాక్టర్ సంజీవరావుకి మంచి చిల్డ్రన్ స్పెషలిస్టుగా పేరొచ్చాక హాస్పిటల్ చాలడం లేదు. పై అంతస్తులోనే కుటుంబం. స్వంత ఇల్లు వేరేగా కట్టుకుంటే పై అంతస్తు కూడా హాస్పిటల్‌కే వాడుకోవచ్చని ఈ మధ్యనే ప్లాట్ కొన్నాడు.

నెల నుంచి ప్లాటుకు ఫెన్సింగ్, పునాదులు, ఇటుక, కంకర తోలకం, వాచ్‌మెన్ షెడ్, మీటర్ ఫిట్టింగ్ కార్యక్రమాలన్నీ జరుగుతున్నాయి.

పిల్లల పోరుతో స్థలం చూపించేందుకు ఈ ఆదివారం బయలుదేరారు డాక్టరు.

అక్కడ...

"నానా" పిలిచింది డాక్టరుగారి కూతురు రాజ్యం.

"ఏంటి బేబీ"

"ఆ ఇల్లెవరిది నానా?"

"అదీ... కొత్త అంకుల్ వాళ్ళది బేబీ"

"నానా! మనిల్లు కూడా అంత పెద్దది కట్టుకుంటామా నానా?"

"ఓ. ఇంకా కొంచెం పెద్దదే కట్టుకుంటాం బేబీ"

"బేబీ! ఆ గుంటలో జారిపడతావ్! ముందుకు జరుగు. ఇలా రా!" తల్లి హెచ్చరికతో తండ్రి దగ్గరగా వచ్చి అనింది రాజ్యం.

"నానా! ఈ గుంట లెందుకు తవ్వుతున్నారు నానా?"

"గోడలు గుంటల లోపల నుంచి కడతారు బేబీ! లేకుంటే ఎవరైనా తోసేస్తే ఇల్లు పడిపోదూ" నవ్వారు డాక్టరుగారు.

"ఇంత పెద్ద ఇల్లు ఎక్కడైనా పడిపోతుందా! మనిల్లు అస్సలు పడిపోదు తెలుసా!"

"బేబీ! ఇలారా! జాగ్రత్తగా రావాలి" దూరంగా పిలిచింది డాక్టరు గారి భార్య.

నెమ్మదిగా అమ్మ, అన్నయ్యల దగ్గరకెళ్ళింది రాజ్యం.

కాస్సేపట్లో మళ్ళీ వచ్చేసింది రాజ్యం. తండ్రిని ఏదో అడగాలనుకుంది. నాన్న మేస్త్రితో ఏదో మాట్లాడ్డం చూసి ఆగిపోయింది.

ఆ వెనకగా చిరిగిన చొక్కా, నిక్కరుతో నిలబడిన వాచ్‌మెన్‌ని చూసి భిక్షగాడనుకుంది.

వాచ్‌మెన్ తనని చూసి నవ్వితే– "ఛో" అంది. కానీ మాటలు బయటకు రాలేదు.

కాస్సేపటికి మేస్త్రీ వెళ్ళిపోయాడు. వెనకనే వాచ్‌మెన్ కూడా...

"నానా! అడుక్కుంటారే – వాళ్ళిక్కడకూ వస్తారా? ఆయనెవరు?" రాజ్యం వాచ్‌మెన్‌ని చూపుతూ ఆ ప్రశ్న వేసింది.

"కాదమ్మా! ఆయన మన కొత్తింటికి వాచ్‌మెన్. వీటన్నిటినీ జాగ్రత్తగా కాపలా కాస్తుంటాడు"

"పాపం" అనింది రాజ్యం. రాజ్యానికి తనను తను క్షమించుకునే పదం దొరకలేదు.

రాజ్యాన్ని ఎత్తుకున్నాడు డాక్టరు

**కూతురునెత్తుకుని, గట్టిగా గుండెలకద్దుకుని ఆనందంగా కన్నీళ్ళు తిరిగేట్టుగా నాలుగైదు చోట్ల ముద్దు పెట్టుకున్నాడు సంజీవరావు. భార్యవైపు రెండడుగులేసి ఆమెను కొత్తగా అప్పుడు గుర్తిస్తున్నట్లుగా ఆరాధనగా చూస్తూ మెత్తగా సగౌరవంగా చేయి పట్టుకుని నొక్కుతూ కారు దగ్గరికి తీసుకెళ్ళాడు డాక్టర్ సంజీవరావు.**

గారు. అన్నయ్య కన్పించాడు. అప్పుడు గుర్తొచ్చింది రాజ్యానికి అన్నయ్య మాట.

"నానా"

"ఊ!... కమాన్" కూతురు కళ్ళలోకి చూశాడు ప్రేమగా డాక్టరు గారు.



"మన కొత్తింట్లో అన్నయ్య కొక్కడికే ఒక గది వుందా?"

"నీకూ, అన్నయ్యకూ కలిపి ఒక పెద్ద గది కడుతున్నారు. అదిగో! అదే మీ ఇద్దరిదీ" చూపించాడు.

"మరి నీ గది ఏది నానా?"

"అదిగో! దాని ఇవతలే నా గది"

"బాత్రూం ఏది నానా?"

"అదిగో? ఆ చివరిదే బాత్రూం! అలాగే ఇదే మెయిన్ హాలు. అది వంటగది. అదిగో! ఆ పక్కనే మనందరం అన్నం తింటాం!"

"నానా! ఆ గది నిజంగా అన్నయ్యకీ, నాకేనా! ఎప్పటికీ!"

"ఎప్పటికీ మీకే బేబీ!"

"ఎ...ప్పటికీ! నేను ఇంకా పెద్దయితే, అమ్మంతయితే కూడానా"

"అమ్మంతయితే... కూడా మీకే బేబీ!" క్షణం బాధేసింది డాక్టరు గారికి. రాజ్యానికి పెళ్ళయితే ఎక్కడుంటుందో? ఎలా వుంటుందో? రాజ్యాన్ని ఉన్నట్లుండి గట్టిగా ముద్దు పెట్టుకున్నాడు డాక్టరు గారు.

ముద్దు నుంచి విడిపించుకుంది రాజ్యం.

"నానా! ఒకటి, రెండు, మూడు, నాలుగు, ఐదు..."

"మరి నాకుంది, అన్నయ్యకుంది, నీకుంది..." అమ్మ వేపు చూపి అడిగింది. "గదులన్నీ ఐపోయాయి. మరి అమ్మకేది?

అమ్మ గది ఎక్కడుంది నానా? అమ్మ గది మర్చిపోయాం నానా!"

రాజ్యంకేసి చూశాడు డాక్టరు గారు. ఏడ్చేసేలా వుంది.

వెంటనే అన్నాడు. "ఇదిగో బేబీ! ఈ గది అమ్మదేగా! నువు మర్చిపోయావు" ఆ సమాధానం డాక్టరు గారికే నచ్చలేదు.

"ఛీ! అది వంట గది నానా" తిరిగి అంది.

"అది నా కొద్దు పో నానా! నీకు లైబ్రరీ వుంది. నీ గదిలో టేప్ రికార్డరుంది. టేబిలుంది, వాలు కుర్చీ వుంది. ఇవన్నీ అమ్మ గదిలో కూడా కావాలి నానా" కింద ఇసుకలో కూర్చుని ఏడవసాగింది రాజ్యం.

సముదాయించడం కోసం చెప్పాడు డాక్టరుగారు జోకీగా అభినయిస్తూ.

"అమ్మకు కూడా షెల్ఫ్ వుంది బేబీ. అందులో జీడిపప్పు, పెసలు, ఆవాలు, టమోటాలు ఇలా అన్నీ వుంచుకోవచ్చు. అదే మీ అమ్మ లైబ్రరీ! కుకర్ విజిల్స్ అమ్మకు సంగీతం బేబీ"

"మరైతే టేప్ సంగీతం వింటూ నువు నిద్రపోతావు. అమ్మ అలా నిద్రపోదేం?" ఏడుపు ఆపి ప్రశ్నించింది రాజ్యం.

కూతుర్నెత్తుకుని, గట్టిగా గుండెల కద్దుకుని, ఆనందంగా కన్నీళ్ళు తిరిగేట్టుగా నాలుగైదు చోట్ల ముద్దు పెట్టుకున్నాడు సంజీవరావుగారు.

ఇంతలో భార్య, కొడుకూ వచ్చారు ఏదో మాట్లాడుకుంటూ.

భార్య వైపు రెండడుగులు వేసి, ఆమెను కొత్తగా అప్పుడు గుర్తిస్తున్నట్టుగా ఆరాధనగా చూస్తూ... మెత్తగా సగౌరవంగా చేయి పట్టుకుని నొక్కుతూ కారు దగ్గరికి తీసుకెళ్ళాడు డాక్టరు సంజీవరావు. 'తప్పిపోయిన గది' నిర్మాణం అప్పుడు ప్రారంభమయింది ఆయన మనసులో. ◆